సాక్షి
అనకాపల్లి
గురువారం । 16 । అక్టోబర్ । 2025



ప్రమాద స్థాయికి 'తాండవ'
తాండవ రిజర్వాయరులో నీటిమట్టం 377.4 అడుగులకు చేరింది. మరో అడుగు పెరిగితే గేట్ల ద్వారా నదిలోకి నీరు విడుదల చేస్తారు.
10లో



25లోగా ఈ-పంట నమోదు
ఈ-పంట వివరాల నమోదు ప్రక్రియను ఈనెల 25లోగా పూర్తి చేయాలని జేసీ జాహ్నవి అధికారులను ఆదేశించారు.
10లో



దామోదర దీపోత్సవం
తగరపువలస: గంభీరంలోని హరేకృష్ణ వైకుంఠంలో బుధవారం దామోదర దీపోత్సవం కన్నులపండువగా జరిగింది.

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా శెట్టి అచ్చిరాజులు



నర్సీపట్నం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర రైతు విభాగం జాయింట్ సెక్రటరీగా నర్సీపట్నం మండలం, అమలాపురం సర్పంచ్ శెట్టి అచ్చిరాజులు (శ్రీనివాసరావు) నియమితులయ్యారు. ఈమేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని శ్రీనివాసరావు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

పార్టీ జిల్లా మహిళా విభాగం కార్యదర్శిగా సోమయాదుల హేమ

అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ మహిళా విభాగం జిల్లా కార్యదర్శిగా సోమయాదుల హేమ, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా జి.పార్వతిదేవిలను నియమించారు.

విదేశాలకు తొలిసారిగా మాంగనీస్



మాంగనీస్‌తో బయల్దేరిన కార్గో షిప్

సాక్షి, విశాఖపట్నం: తొలిసారిగా విదేశాలకు మాంగనీస్ ఎగుమతి నిర్వహించి విశాఖపట్నం పోర్టు అథారిటీ అరుదైన మైలురాయిని చేరుకుంది. పనామా కాలువకు చెందిన బల్క్‌డ్రగ్ కార్గో క్యారియర్ షిప్ ఎంవీ హెలెన్ బల్కర్ ద్వారా మాంగనీస్ ఖనిజం ఎగుమతైంది. విశాఖపట్నం పోర్టులోని వెస్ట్ క్యూ-4 బెర్త్‌లో 20 వేల మెట్రిక్ టన్నుల మాంగనీస్‌ను బుధవారం సాయంత్రం లోడ్ చేశారు. అనంతరం ఎంవీ హెలెన్ బల్కర్ కార్గో వెసల్ చైనాకు బయల్దేరింది.

విద్యుత్ రంగంలో ఆవిష్కరణలకు హ్యాకథాన్

సాక్షి, విశాఖపట్నం: విద్యుత్ రంగంలో సాంకేతిక ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు 'హ్యాక్ ఏపీ హ్యాకథాన్' నిర్వహిస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. ప్రమాదాలను ముందుగా గుర్తించడం, స్మార్ట్ మీటర్ డేటా విశ్లేషణ ద్వారా ఆదాయ సంరక్షణ, ట్రాన్స్‌ఫార్మర్ ఫెయిల్యూర్ ప్రిడిక్షన్, హైటెన్షన్ లైన్లలో ఇన్సులేటర్ వైఫల్యాల గుర్తింపు తదితర అంశాలపై ఆవిష్కరణలను ఆహ్వానిస్తున్నామన్నారు. దీనిని ఏపీఈపీడీసీఎల్, ఏపీసీపీడీసీఎల్, ఏపీఎస్‌పీడీసీఎల్ సంయుక్తంగా విశాఖలో నిర్వహిస్తున్నాయని.. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఎనర్జీ ట్రాన్సిషన్, క్లైమేట్ కలెక్టివ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతోందని పేర్కొన్నారు. వివరాలు, రిజిస్ట్రేషన్ల కోసం https://electronvibe.com/hackap&hackathon/ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. ఈ నెల 22వ తేదీ అర్ధరాత్రి 12 వరకు రిజిస్ట్రేషన్లు కొనసాగుతాయని చెప్పారు.

రాజయ్యపేటలో ఏం జరుగుతోంది?

రాజయ్యపేట గ్రామం.. 32వ రోజుకు చేరిన మత్స్యకారుల రిలే నిరాహార దీక్ష.. బుధవారం కలెక్టర్ విజయ కృష్ణన్ వచ్చి వారితో సమావేశం కావాల్సి ఉంది. కానీ అనివార్య కారణాల వల్ల ఆమె రాలేకపోయారు. ఆ సమాచారాన్ని ముందుగానే ఆర్డీవో వచ్చి చెప్పడంతో దీక్ష ప్రశాంతంగా సాగుతోంది. ఇంతలో బిలబిలమంటూ వందలాదిమంది పోలీసులు వాహనాల్లో దిగారు. రాజయ్యపేటతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో మోహరించారు. ఇదంతా శాంతిభద్రతల పరిరక్షణకేనని ఎస్పీ చెబుతున్నారు. అయితే ఎలాంటి ఉద్రిక్తత లేకుండా ఇదంతా ఎందుకన్న సందేహాలు నెలకొన్నాయి. శిబిరాన్ని ఎత్తి వేయించడానికే ఈ చర్యలన్నీ తీసుకుంటున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



బుచ్చిరాజుపేట జంక్షన్‌లో పోలీసులు



రాజయ్యపేటలో మోహరించిన పోలీసులు

టెన్షన్ లేకుండానే పోలీసుల అటెన్షన్ ● వెయ్యిమందికి పైగా మోహరింపు

- బల్క్ డ్రగ్ పార్క్‌కు వ్యతిరేకంగా కొనసాగుతున్న దీక్షలు
- ప్రశాంతంగా ముగిసిన 32వ రోజు రిలే నిరశన
- ఐదు జిల్లాల పోలీసుల రాకతో గ్రామం చుట్టుపక్కల ఉద్రిక్త వాతావరణం

నక్కపల్లి: బల్క్ డ్రగ్ పార్క్ ఉద్యమంతో అట్టుడుకుతున్న రాజయ్యపేట గ్రామం ప్రస్తుతం పోలీసు వలయంలో ఉంది. ఉమ్మడి విశాఖ జిల్లాతోపాటు శ్రీకాకుళం, విజయనగరం, కాకినాడ జిల్లాల నుంచి వెయ్యిమందికి పైగా పోలీసు సిబ్బంది గ్రామంలో, చుట్టుపక్కల ప్రాంతాల్లో మోహరించారు. గ్రామ సరిహద్దులను, చుట్టుపక్కల గ్రామాలను జల్లెడ పడుతున్నారు. ఏ క్షణాన ఏం జరుగుతుందోనన్న టెన్షన్ నెలకొంది. మధ్యాహ్నం నుంచి ఎస్పీ తుహిన్ సిన్హా సైతం మండల కేంద్రంలో ఉండి పరిస్థితి సమీక్షిస్తున్నారు. సివిల్ పోలీసులతోపాటు ఏఆర్ సిబ్బంది, ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులను సైతం రంగంలోకి దించారు. పోలీసులు ఇతర ప్రాంతాల నుంచి రాజయ్యపేట వెళ్లే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. బాష్పవాయువు, నీటిని ప్రయోగించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. వజ్ర వాహనాలను అందుబాటులో ఉంచారు. సాయంత్రం ఆరు గంటల సమయంలో ఎస్పీ గ్రామాన్ని సందర్శించి అక్కడ బందోబస్తు కోసం వచ్చిన పోలీసు ఉన్నతాధికారులకు, సిబ్బందికి కొన్ని సూచనలు చేశారు.

నెల రోజులుగా ఏక 'దీక్ష'గా..

బల్క్ డ్రగ్ పార్క్ పెట్టి సముద్రాన్ని కలుషితం చేయవద్దని, తమ పొట్ట కొట్టవద్దని రాజయ్యపేట మత్స్యకారులు 32 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. 15 రోజుల క్రితం గ్రామంలోకి వచ్చిన హోంమంత్రి వంగలపూడి అనితను మత్స్యకారులు అడ్డుకుని ఆమె కాన్వాయ్‌ను కదలకుండా నిర్బంధించారు. తమ దీక్షకు సంఘీభావం తెలిపేందుకు వస్తున్న వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల వారిని పోలీసులు అడ్డుకోవడం, నిర్బంధించడంతో ఆగ్రహం చెందిన మత్స్యకారులు గత ఆదివారం నక్కపల్లి జాతీయ రహదారిని ముట్టడించి, నాలుగు గంటల పాటు ట్రాఫిక్‌ను స్తంభింపచేశారు. కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హాలు ఆందోళకారుల వద్దకు వచ్చి చర్చలు జరిపారు. బల్క్ డ్రగ్ పార్క్ రద్దు చేయాలని, తమపై పెట్టిన కేసులు వెనక్కుతీసుకోవాలని, గ్రామంలో 144 సెక్షన్ ఎత్తివేయాలని, నిరాహార దీక్షకు వచ్చే వివిధ పార్టీల నాయకులు, మత్స్యకార సంఘ నేతలను అడ్డుకోడానికి వీల్లేదంటూ షరతులు విధించారు. ఈనెల 15న గ్రామంలోకి వచ్చి సమావేశం ఏర్పాటు చేస్తానని, మీ డిమాండ్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని కలెక్టర్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అయితే అనివార్య కారణాల వల్ల బుధవారం రాజయ్యపేటకు కలెక్టర్ రాలేకపోయారు. మత్స్యకారులు మాత్రం యథావిధిగా దీక్ష కొనసాగిస్తున్నారు. ఇంతలో ఉన్నట్టుండి ఐదు జిల్లాల నుంచి వచ్చిన సుమారు వెయ్యిమందికి పైగా పోలీసులు మండలంలో మోహరించారు. రాజయ్యపేట వెళ్లే ఉపమాక రోడ్డు జంక్షన్, ఉపమాక, హెటిరో పరిశ్రమ, బుచ్చిరాజుపేట జంక్షన్, బోయపాడు జంక్షన్, రాజయ్యపేట, పెదతీనార్ల, గుర్రాజుపేట, చందనాడ, అయ్యన్నపాలెం తదితర ప్రాంతాల్లో వీరు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

ఎందుకు ఇదంతా?

బల్క్ డ్రగ్ పార్క్ పనులు జరుగుతున్న ప్రాంతాలను, రాజయ్యపేట గ్రామాన్ని పోలీసులు అష్ట దిగ్బంధనం చేశారు. ఆందోళన ప్రారంభమయినప్పటి నుంచి నిరసనకారులపై పోలీసులు పలు సెక్షన్లతో కేసులు నమోదు చేశారు. హోంమంత్రిని అడ్డుకున్న ఘటన, జాతీయ రహదారిని దిగ్బంధించిన ఘటనలపై కూడా వందలాది మంది మత్స్యకారులపై పోలీసులు కేసులు నమోదు చేసినట్టు ప్రచారం జరుగుతోంది. బల్క్ డ్రగ్ పార్క్‌కు వ్యతిరేకంగా ఒక్క రాజయ్యపేట గ్రామస్తులు మాత్రమే ఆందోళన చేస్తుంటే అదుపు చేయడంలో పోలీసు యంత్రాంగం విఫలమయిందని, హ్యాండిల్ చేయడం చేతకాకపోతే చెప్పండి అంటూ 'చినబాబు' జిల్లా పోలీసు ఉన్నతాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో భారీగా పోలీసులను మోహరించి ఉద్యమకారుల్లో భయాందోళనలు పుట్టించి దీక్షా శిబిరం ఎత్తివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ప్రచారం జరుగుతోంది.

శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా ఉండేందుకే..

బల్క్ డ్రగ్ పార్క్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంలో ఇటీవల జరిగిన పరిణామాలు, ఉద్రిక్తతల నేపథ్యంలో ముందు జాగ్రత్తలు తీసుకున్నాం. మత్స్యకారులు తమ సమస్యల పరిష్కారం, డిమాండ్ల సాధన కోసం ఆందోళన చేయడంలో తప్పులేదు. అయితే శాంతియుతంగా దీక్ష చేస్తున్న ఆందోళనకారులను కొంతమంది బయటి వ్యక్తులు వచ్చి రెచ్చగొడుతున్నారు. ఉద్రిక్తతలకు, హింసాత్మక సంఘటనలకు ప్రేరేపిస్తున్నారు. ఇటువంటి వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నాం. రెచ్చగొట్టడం వల్ల అమాయకులైన మత్స్యకారులు బలయ్యే అవకాశం ఉంది. శాంతిభద్రతలు, ప్రభుత్వ ఆస్తులు కాపాడేందుకు పోలీసులకు ఉన్న అన్ని అధికారాలను ఉపయోగిస్తాం. ఇంతవరకు జిల్లాలో ఎక్కడా హింసాత్మక సంఘటనలు జరగలేదు. రాజయ్యపేటలో కూడా జరగకూడదనే ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

-ఎస్పీ తుహిన్ సిన్హా



పోలీసులకు సూచనలు ఇస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా



నక్కపల్లి జాతీయ రహదారిపై ఉపమాక రోడ్డు జంక్షన్ వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

డ్రెడ్జింగ్‌కి మళ్లీ నకిలీ బాస్?

అక్రమాల పుట్టగా మారిన డ్రెడ్జింగ్ కార్పొరేషన్ మరోసారి వివాదాస్పద నియామకానికి సిద్ధమవుతోంది. నకిలీ ధ్రువపత్రాలతో గతంలో ఉన్నత హోదాలో కూర్చోబెట్టి.. తర్వాత విధుల నుంచి తప్పించిన బోర్డు.. ఇప్పుడు మళ్లీ సంస్థలో అదే వ్యక్తికి కీలక బాధ్యతలు అప్పగించేందుకు చూస్తోంది. ప్రభుత్వ రంగ సంస్థలో కీలకమైన పోస్టు నియామకంలో గుడ్డిగా వ్యవహరించడం వెనక కూటమి ఎంపీ సిఫార్సు ఉన్నట్లు తెలుస్తోంది. భారీగానే డబ్బులు చేతులు మారాయని.. అందుకే సదరు అనర్హుడైన 'నకిలీ' ఉన్నతాధికారిని మరోసారి సింహాసనంపై కూర్చోబెట్టేందుకు అంతా సిద్ధం చేసినట్లు సమాచారం.



డ్రెడ్జింగ్ కార్పొరేషన్ కార్యాలయం

- రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రి అండతో పావులు కదుపుతున్న అధికారి
- గతంలో ఫేక్ డిగ్రీలతో పాటు సామాజిక వర్గాన్ని మార్చేశారనే ఆరోపణలు
- సంస్థ నష్టాలకూ కారణమయ్యారని దిగువ స్థాయి కేడర్‌కి డిమోషన్
- అదే కుర్చీ కోసం రూ.లక్షలు ముట్టజెప్పేందుకు కేంద్ర మంత్రితో డీల్.!
- ఆధారాలతో సహా సీబీఐకి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్న ఉద్యోగులు

సాక్షి, విశాఖపట్నం : నష్టాల బాటలో పయనిస్తున్న డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌ను గట్టెక్కించేందుకు చర్యలు తీసుకోవాల్సిన బోర్డు.. చేసిన తప్పునే మళ్లీ చేస్తోంది. సంస్థలో కీలకమైన పోస్టు ఎంపికలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. గతంలో నకిలీ సర్టిఫికెట్లతో ఎండీగా, సీఈవోగా బాధ్యతలు చేపట్టిన జీవైవీ విక్టర్.. సంస్థను కోట్ల రూపాయలకు పైగా నష్టాల ఊబిలో కూరుకుపోయేలా చేశారు. నిండా మునిగిన తర్వాత తేరుకున్న ఉన్నతాధికారులు ఆయన్ని విధుల నుంచి తప్పించారు. తర్వాత జరిగిన ప్రధాన నియామకం కూడా అదేరీతిలో మారి వివాదాస్పదమైంది. సదరు వ్యక్తి 1987లో ఎస్సీ కోటా స్పెషల్ డ్రైవ్‌లో షిప్‌లో డెక్ కేడెట్‌గా డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌లో చేరారు. 2009లో డీజీఎంగా పదోన్నతి పొంది.. పట్టుమని పది నెలలైనా పని చెయ్యకుండా డీసీఐకు రాజీనామా చేసేశారు. డీసీఐ ప్రత్యర్థి సంస్థగా చెప్పుకునే మెర్కటర్ సంస్థలో డీజీఎం ఆపరేషన్స్‌గా జాయిన్ అయ్యారు. రెండున్నరేళ్లు పనిచేసి తిరిగి 2012లో డీసీఐకి వచ్చేశారు. ఈ సమయంలో డీసీఐలో తిరిగి చేరినప్పుడు విద్యార్హతలకు సంబంధించిన నకిలీ ధ్రువపత్రాలను సమర్పించినా ఆయనకు కీలక బాధ్యతలు కట్టబెట్టేశారు.

అర్హతలన్నీ అబద్ధాలే..!

గతంలో కీలక బాధ్యతల పోస్టు కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు అందులో హిందూగా పేర్కొన్నారు. ఆ సమయంలోనే సదరు అధికారి నగరంలోని యూనియన్‌చాపల్ బాప్టిస్ట్ చర్చ్‌కి వైస్ చైర్మన్‌గా ఉన్నారు. క్రిస్టియన్‌గా ఉంటూ ఉద్యోగం కోసం చేసిన దరఖాస్తులో మాత్రం హిందూగా పేర్కొన్నారని ఆరోపణలు మొదలుకొని.. బీకామ్ డిగ్రీతో పాటు డ్రెడ్జ్ గ్రేడ్ మాస్టర్-1 అర్హతలపైనా విమర్శలు వెల్లువెత్తాయి. డిగ్రీ సర్టిఫికెట్ నకిలీదని గుర్తించారు. అంటే కేవలం ఇంటర్ విద్యార్హత ఉన్న వ్యక్తిని తీసుకెళ్లి సింహాసనంపై కూర్చోబెట్టారన్న ఆరోపణలతో డీసీఐ అట్టుడికిపోయింది. ఈయన వ్యవహారశైలి, తప్పుడు ధ్రువపత్రాల అంశాలపై గతంలో సీబీఐకి ఫిర్యాదు చేయడంతో విచారణ చేసిన బోర్డు డిమోషన్ చేసి సీజీఎంగా బాధ్యతలు అప్పగించింది.

కేంద్ర మంత్రి సిఫార్సుతో మరోసారి..!

సీజీఎంగా ఉన్న సదరు అధికారికి సింహాసనంపైనే దృష్టి ఉండేది. ఆ కుర్చీ కోసం ఇన్‌చార్జ్‌గా నియమించిన ఉన్నతాధికారిని పక్కనపెట్టేసి.. అన్నీ తానై డ్రెడ్జింగ్‌లో చక్రం తిప్పేవారు. ఇప్పుడు కూటమి పార్టీకి చెందిన ఓ కేంద్ర మంత్రితో రికమెండేషన్ కోసం డీల్ మాట్లాడుకున్నట్లు తెలుస్తోంది. దీనివెనుక రూ.లక్షలు చేతులు మారాయనే ఆరోపణలు డీసీఐలో వినిపిస్తున్నాయి. కేంద్ర మంత్రి సిఫార్సులకు బోర్డు కూడా తలొగ్గినట్లు తెలుస్తోంది. త్వరలోనే సదరు వ్యక్తిని కీలకు కుర్చీలో కూర్చోబెట్టేందుకు ఆర్డర్లు కూడా సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. గతంలో తప్పుడు ధ్రువీకరణ పత్రాలు, సామాజికవర్గం విషయంలోనూ తప్పుడు సమాచారం ఇచ్చిన వ్యక్తికి మళ్లీ అవే బాధ్యతలు కట్టబెట్టడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. **విశాఖ పోర్టులో ఇటీవల బదిలీ అయిన వ్యక్తుల ప్రమేయం కూడా ఇందులో ఉన్నట్లు ఆరోపణలున్నాయి.** మరోసారి 'నకిలీ' అధికారికి **డ్రెడ్జింగ్‌లో** కీలకబాధ్యతలు అప్పగిస్తే.. సంస్థ **నష్టాలతో** మరింత దిగజారిపోతుందన్న ఆందోళన ఉద్యోగుల్లో వ్యక్తమవుతోంది. సదరు 'నకిలీ' ఉన్నతాధికారి.. గతంలో డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌కి రాజీనామా చేసి.. మెర్కటర్‌లో చేరిన తర్వాత.. డీసీఐకి నష్టం వాటిల్లేలా వ్యవహరించినట్లు కూడా సీబీఐకి కొందరు ఉద్యోగులు ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. ఇలా ప్రతి విషయంలోనూ సదరు అధికారికి సంబంధించిన నియామకం వెనుక ఉన్న అక్రమాల జాబితాని జత చేర్చుతూ.. కేంద్ర పోర్టులు మంత్రిత్వ శాఖతో పాటు సీబీఐకి మరోసారి ఫిర్యాదు చేసేందుకు ఉద్యోగులు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ 'నకిలీ' నియామకానికి సహకరిస్తున్న పోర్టు అధికారులపైనా ఆధారాలతో సహా ఫిర్యాదు చేయాలని భావిస్తున్నట్లు సమాచారం.

కలిగొట్ల బ్రాంచి చానల్ కాలువకు భారీ గండి

3 వేల ఎకరాల ఆయకట్టుకు నిలిచిన సాగునీటి సరఫరా

దేవరాపల్లి: రైవాడ జలాశయం నుంచి ఆయకట్టుకు సాగు నీరందించే కలిగొట్ల బ్రాంచి చానల్ కాలువకు సోమవారం రాత్రి భారీ గండి పడింది. తారువ ఆనకట్టకు అర కిలోమీటరు దూరంలో ఈ కాలువ ఎడమ గట్టు సుమారు 20 నుంచి 30 మీటర్ల మేర కోతకు గురైంది. దీంతో కాలువను ఆనుకొని ఉన్న సుమారు పది ఎకరాలలో వరి, సరుగుడు ఇతర పంటలు నీటి ముంపునకు గురయ్యాయి. తారువ ఆనకట్ట వద్ద ఏర్పాటు చేసిన మదుం ద్వారా దిగువన ఉన్న ఆయకట్టుకు ఈ కాలువ ద్వారా 50 క్యూసెక్కుల నీరు సరఫరా చేస్తున్నారు. కాలువకు గండి పడడంతో కొంత మేర పంట పొలాలను ముంచెత్తగా, మరికొంత మేర నీరు శారదానదిలోకి కలిసిపోతుంది. ఈ కాలువ ద్వారా తిమిరాం, కలిగొట్ల, బోయిలకింతాడ గ్రామాలకు చెందిన సుమారు 3 వేల ఎకరాలకు ఆయకట్టుకు సాగునీటిని అందిస్తున్నారు. కాలువకు గండి పడడంతో ఆయకట్టుకు సాగునీటి సరఫరా ప్రశ్నార్థకంగా మారింది. ఖరీఫ్ వరి చిరు పొట్ట, పొట్ట దశలో ఉన్న తరుణంలో సాగునీటి సరఫరా నిలిచిపోవడంతో ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలువకు గండిపడి మూడు రోజులు గడవగా నీటి సరఫరా నిలిపివేసిన ఇరిగేషన్ అధికారులు, గండి పూడ్చివేత పనులు చేపట్టక పోవడం శోచనీయం. ఇప్పటికైనా ఇరిగేషన్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి కాలువ గండిని పూడ్చి నీటి సరఫరాను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు.



తారువ ఆనకట్టకు సమీపంలో కలిగొట్ల బ్రాంచి చానల్ కాలువకు గండి

ఒక్కటైన ప్రేమ జంట

రక్షణ కల్పించాలని అధికారులకు వినతి

బుచ్చెయ్యపేట: ప్రేమించుకున్న యువ జంట పెళ్లి చేసుకొని ఒక్కటయ్యారు. తమకు రక్షణగా నిలవాలని తహసీల్దార్, పోలీసులను ఆశ్రయించారు. పెదపూడికి చెందిన వియ్యపు గణేష్, ఇదే పంచాయతీ శివారు గ్రామం చిన్నయ్యపాలేనికి చెందిన ఎం.జ్యోతి నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఇటీవల జ్యోతి కుటుంబ సభ్యులు ఆమెకు వివాహం చేయడానికి ఏర్పాట్లు చేపట్టారు. దీంతో గణేష్, జ్యోతి దసరా రోజున ఇంటి నుంచి హైదరాబాద్ వెళ్లిపోయారు. అక్కడ ఆర్య సమాజంలో రిజిస్టర్ వివాహం చేసుకున్నారు. దీనిపై జ్యోతి కుటుంబ సభ్యులు ఈనెల 3వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ కుమార్తెను అప్పగించాలని పోలీసులను కోరారు. బుచ్చెయ్యపేట అదనపు ఎస్‌ఐ భాస్కరరావు వీరిద్దరిని పట్టుకుని బుధవారం తహసీల్దార్ లక్ష్మి ఎదుట హాజరు పరిచి జ్యోతిని ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించారు. తామిద్దరం మేజర్లమని, ప్రేమించి పెళ్లి చేసుకున్నామని, తన కుటుంబ సభ్యులకు తమ వివాహం ఇష్టం లేదని, వారి నుంచి ఎటువంటి ఆపద లేకుండా చూడాలని జ్యోతి తహసీల్దార్, ఎస్‌ఐలకు విన్నవించింది. అనంతరం అత్తవారింట్లో భర్త వద్దకు వెళ్లిపోయింది.



హైదరాబాద్ ఆర్య సమాజంలో వివాహం చేసుకున్న జ్యోతి, గణేష్

క్లుప్తంగా

నాగజ్యోతికి ఘన సన్మానం



నాగజ్యోతిని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు

రోలుగుంట: రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, స్థానిక హైస్కూల్‌కు చెందిన ఆంగ్ల ఉపాధ్యాయిని పీవీఎం నాగజ్యోతిని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు, మాజీ వైస్ చాన్సలర్ ముత్యాలనాయుడు ఘనంగా సన్మానించారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి పురస్కరించుకుని బుధవారం విజయనగరం జిల్లా గజపతినగరంలో బాలాజీ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇక్కడ సత్యసాయి దివ్యామృతం (ఉచిత కేన్సర్ అండ్ కిడ్నీ డయాలసిస్ ఆస్పత్రి) సంస్థ అధినేత దివ్యామృత సాయి ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర జిల్లాల్లో రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు సన్మానం చేశారు.

అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ద్వితీయ స్థానం

- అనకాపల్లి ఎంపీడీవో కార్యాలయ ఏవో రాముకు అభినందన



ఏవో రామును శాలువాలతో సత్కరిస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

అనకాపల్లి: స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఏవో డి. రాము అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ ఓపెన్ కేటగిరీ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించాడు. హాంకాంగ్‌లో ఈ నెల 8 నుంచి 12వ తేదీ వరకూ ఈ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో 120 కేజీల మాస్టర్స్ విభాగంలో పాల్గొని 125 కేజీలు బెంజ్‌ప్రెస్ ఎత్తి సత్తా చాటాడు. ఈ సందర్భంగా బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో రామును ఎంపీపీ గొర్లి సూరిబాబు శాలువాలతో సత్కరించారు. ఎంపీపీ మాట్లాడుతూ రాము ప్రతిభ స్ఫూర్తిదాయకమన్నారు. ఉద్యోగ నిర్వహణ చేస్తూ క్రీడల్లో రజత పతకం సాధించి దేశానికి, రాష్ట్రానికి, జిల్లాకు పేరు తీసుకొచ్చారని కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలను సాధించాలని ఆకాంక్షించారు. మండల పరిషత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైళ్లలో బాణసంచా రవాణా నిషేధం

తాటిచెట్లపాలెం: దీపావళి సందర్భంగా రైళ్లలో దీపావళి మందుగుండు సామగ్రి రవాణా విషయంలో వాల్తేర్ డివిజన్ అధికారులు తనిఖీలను ముమ్మరం చేశారు. రైళ్లలో దీపావళి సామాన్లు తరలించడం రైల్వే చట్టం ప్రకారం నిషేధమని, దీనివల్ల ప్రయాణికుల ప్రాణాలకు ఎంతో హానికరమని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోను మండే స్వభావం గల వాటిని రైళ్లలో రవాణా చేయవద్దని ప్రయాణికులకు విజ్ఞప్తి చేశారు. ఎవరైనా ఇటువంటి నిషేధ వస్తువులు రవాణా చేయడం గుర్తిస్తే సమీప రైల్వే అధికారులకు లేదా రైల్వే భద్రతా దళానికి తెలియజేయాలని సూచించారు. ఈ విషయంలో వాల్తేర్ డివిజన్ ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

25లోగా ఈ-పంట నమోదు

- ధాన్యం సేకరణకు 63 కేంద్రాల ఏర్పాటు
- బాణసంచా కేంద్రాల్లో భద్రతా ప్రమాణాలు తనిఖీ చేయాలి
- జాయింటు కలెక్టర్ జాహ్నవి ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జేసీ జాహ్నవి

తుమ్మపాల: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి సాగుపై ఈ-పంట వివరాలు నమోదు ప్రక్రియ ఈ నెల 25వ తేదీలోగా పూర్తి చేయాలని జాయింటు కలెక్టరు ఎం. జాహ్నవి అధికారులను ఆదేశించారు. కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరం నుంచి బుధవారం మండలాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధాన్యం సేకరణకు జిల్లాలో 63 సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. అవసరమైతే మరిన్ని కేంద్రాలు ఏర్పాటుకు ప్రతిపాదనలు అందజేయాలన్నారు. ధాన్యం సేకరణకు సంబంధించి మండల, గ్రామ స్థాయి కమిటీల నియామకం చేయాలన్నారు. ప్రతి ఒక్కరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు అవసరమైన ఇంటి స్థలాలను ప్రస్తుత లేఅవుట్లలో ఖాళీల్లో భర్తీ చేయాలన్నారు. అదనంగా భూమి అవసరమైతే అందుబాటులో నివాసానికి అనుకూలమైన ప్రభుత్వ భూమిని గుర్తించి సేకరించాలన్నారు. అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి రెగ్యులరైజేషన్ చేయుటకు సమగ్ర వివరాలతో ప్రతిపాదనలు పంపించాలని తెలిపారు. పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను డివిజను, మండల స్థాయిలో సీసీఎల్ఏ నిర్దేశించిన ప్రొఫార్మా ప్రకారం రిజిస్టరు చేయాలన్నారు. తిరస్కరించే అర్జీలకు అందుకు గల కారణాన్ని అర్జీదారునికి అందజేయాలన్నారు. మీడియాలో వచ్చే ప్రతికూల వార్తలపై తీసుకున్న చర్యలపై నివేదికలు అందించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. దీపావళి పండగ సందర్భంగా బాణసంచా క్రయవిక్రయాలు పెరుగుతాయని, తయారీ కేంద్రాల్లో భద్రతా ప్రమాణాలను తనిఖీ చేయాలన్నారు. ఓటర్ జాబితాపై ఓటరు వెరిఫికేషన్ పూర్తి చేసిన పిదప, ప్రతి ఓటరు మ్యాపింగు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై. సత్యనారాయణరావు, జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు, సివిల్ సప్లయి జిల్లా మేనేజరు పి.జయంతి, కలెక్టరు కార్యాలయ సూపరింటెండెంట్లు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

పార్టనర్‌షిప్ సమ్మిట్ పోస్టర్ ఆవిష్కరణ

విశాఖపట్నంలో నవంబరు 14, 15 తేదీల్లో సీఐఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పార్టనర్‌షిప్ సమ్మిట్ -2025 సందర్భంగా పరిశ్రమలు, వాణిజ్య శాఖలో వివిధ అంశాలపై నెల రోజుల పాటు నిర్వహించే ''ఏపీఐఐసీ – పార్టనర్‌షిప్ డ్రైవ్ '' పోస్టర్‌ను జేసీ ఎం. జాహ్నవి బుధవారం కలెక్టర్ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజరు ఎస్. నరశింహరావు, డీజెడ్ఎం సూర్యనారాయణ, జనరల్ మేనేజరు ప్రసాదు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై 60 రోజుల్లో పరిష్కారం



విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదులు స్వీకరిస్తున్న సీజీఆర్ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ

సీజీఆర్ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ

సబ్బవరం: ఈపీడీసీఎల్ పరిధిలో విద్యుత్ వినియోగదారులు తామెదుర్కొనే సమస్యలపై ఫిర్యాదు చేస్తే 60 రోజుల్లో పరిష్కారం చూపిస్తామని విశ్రాంత న్యాయమూర్తి, సీజీఆర్ఎఫ్ చైర్మన్ బి.సత్యనారాయణ తెలిపారు. సబ్బవరం మండల కేంద్రంలోని ఏపీఈపీడీసీఎల్ సెక్షన్-1 కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం(సీజీఆర్ఎఫ్) అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు వినియోగదారుల న్యాయస్థానం ఉందన్న విషయం తెలుసుకోవాలన్నారు. వినియోగదారులు తమ సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేదని, ఆన్‌లైన్ విధానంలో ఫిర్యాదుచేసి పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ ఏడాది ఇప్పటివరకూ 1045 ఫిర్యాదులు అందాయని, ఆయా సమస్యల్ని ఇప్పటికే పరిష్కరించగా మరో 169 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని సభలో వివరించారు. చిన్న చిన్న సమస్యలపై వినియోగదారులు కోర్టును ఆశ్రయించాల్సిన పని లేదని నేరుగా ఈపీడీసీఎల్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవచ్చన్నారు. ముందుగా ఏపీ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు కాండ్రేగుల వెంకటరమణ మాట్లాడుతూ కన్స్యూమర్ ప్రొటెక్షన్ యాక్ట్, సమాచార హక్కు చట్టంల గురించి వివరించారు. వినియోగదారుల హక్కుల చట్టాలపై సీజీఆర్ఎస్ చైర్మన్ సత్యనారాయణతో కలిసి సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలపై అందించిన వినతుల్ని స్వీకరించారు. కార్యక్రమంలో సంస్థ ఈఈ ఎస్ రామకృష్ణ, డీఈఈ ఎన్.సురేష్, ఏఈఈ ఎం.దుర్గాప్రసాద్, సులోచనరాణి తదితరులు పాల్గొన్నారు.

కల్తీ మద్యానికి ఆంధ్రప్రదేశ్ అడ్డా

- నకిలీ మద్యంపై సీబీఐ విచారణ జరిపిస్తేనే వాస్తవాలు తెలుస్తాయి
- డైవర్షన్ కోసం మాజీ మంత్రి జోగి రమేష్ పేరు తెరపైకి
- కల్తీ మద్యం నిందితులతో కూటమి నేతల ఫొటోలు
- ధ్వజమెత్తిన మాజీ ప్రభుత్వ విప్, పీఏసీ సభ్యుడు ధర్మశ్రీ



సాక్షి, విశాఖపట్నం: కల్తీ మద్యానికి ఏపీ అడ్డాగా మారిందని.. రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉండే సిట్‌తో కాకుండా సీబీఐతో దర్యాప్తు చేస్తే వాస్తవాలు బయటపడతాయని మాజీ ప్రభుత్వ విప్, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు కరణం ధర్మశ్రీ అన్నారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో బెల్టు దుకాణాలు తెరిచి.. వాటి ద్వారా కల్తీ మద్యాన్ని అమ్ముతూ కూటమి నేతలు జేబులు నింపుకుంటున్నారని మండిపడ్డారు. కుటీర పరిశ్రమలా నకిలీ మద్యం తయారు చేస్తూ, ఆధారాలతో సహా బయటపడినప్పటి నుంచి, దాన్ని ఎలాగైనా వైఎస్సార్ సీపీకి అంటగట్టేందుకు టీడీపీ పెద్దలు చేస్తున్న కుట్రలు పరాకాష్టకు చేరాయన్నారు. కేసులో ప్రధాన నిందితుడు జనార్దనరావు వీడియో లీక్, కేసు డైవర్షన్ కోసం సీఎం చంద్రబాబు చేసిన కుట్ర అని స్పష్టమవుతోందన్నారు. కల్తీ మద్యం కేసును డైవర్ట్ చేయడానికి తమ పార్టీ నేత, మాజీ మంత్రి జోగి రమేష్ పేరును తెరపైకి తెచ్చారని మండిపడ్డారు. కల్తీ మద్యం నేతలతో స్టైల్‌గా కూటమి నేతల ఫొటోలు కనిపిస్తే ఎందుకు చర్యలు తీసుకోలేదంటూ ప్రశ్నించారు. నకిలీ మద్యం కేసులో మాజీ మంత్రి జోగి రమేష్‌కు ప్రమేయం ఉందంటూ కేసులో ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్దనరావు ఆరోపణల వెనక చంద్రబాబు, లోకేష్ కుట్ర, కుతంత్రం ఉందన్నారు. తమ పార్టీ డిమాండ్ చేస్తున్నట్లు నకిలీ మద్యం కేసుపై సీబీఐ దర్యాప్తు ఎందుకు కోరడం లేదు? కేసులో ప్రమేయం ఉందని పేరు చెప్పించిన వైఎస్సార్‌సీపీ నేత జోగి రమేష్ చేసిన సవాల్.. లై డిటెక్టర్ టెస్ట్‌కు మీరు సిద్ధంగా ఉన్నారా? అని ప్రశ్నించారు. మీకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే, ఇప్పటికీ రాష్ట్రంలోని అన్ని వైన్‌షాప్‌లు, పర్మిట్ రూమ్‌లు, బార్లు, బెల్టు షాప్‌ల్లో తనిఖీలు ఎందుకు చేయడం లేదు? ఏది అసలు మద్యం? ఏది నకిలీ అనేది గుర్తించే ప్రయత్నం ఎందుకు చేయడం లేదంటూ ఆక్షేపించారు. అసలు జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న అద్దేపల్లి జనార్దనరావు వీడియో ఎలా రికార్డ్ చేశారని ప్రశ్నించారు. ఏ కేసులో నిందితుడైనా, ఇన్వెస్టిగేటివ్ అధికారుల ముందు ఏదైనా చెప్పాలనుకున్నప్పుడు నిలబడి, చేతులు కట్టుకుని వినమ్రంగా మాట్లాడతాడు.. కానీ నిన్న లీక్ చేసిన వీడియోలో ఆయన చక్కగా చైర్‌లో కూర్చున్నాడు.. పైగా తను ఆఫ్రికా నుంచి వచ్చినప్పటి డ్రెస్‌తోనే ఉన్నాడు.. మరి ఆ వీడియో ఎప్పుడు, ఎవరు, ఎవరి ఫోన్‌లో రికార్డు చేశారని ప్రశ్నించారు. పోలీసుల అదుపులో, జైలు అధికారుల రిమాండ్‌లో ఉన్న వ్యక్తి వీడియో లీకు కావడానికి బాధ్యత ఎవరిదన్నారు.

ప్రమాద స్థాయికి తాండవ నీటిమట్టం

నాతవరం: తాండవ రిజర్వాయరులో నీటిమట్టం బుధవారం నాటికి 377.4 అడుగులకు చేరింది. మరో అడుగు నీటిమట్టం పెరిగితే ప్రమాద నివారణ చర్యలో భాగంగా గేట్లు ద్వారా నదిలోకి నీరు విడుదల చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లాలోనే ఏకైక మేజరు ప్రాజెక్టు తాండవ నుంచి ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఆయకట్టుకు నీటిని ఆగస్టు 10న విడుదల చేశారు. ఆ సమయంలో ప్రాజెక్టులో 363.0 అడుగులు మాత్రమే ఉండేది. ఈ ఏడాది అధికంగా వర్షాలు కురవడంతో ప్రస్తుతం నీటిమట్టం 377.4 అడుగులు ఉంది. రిజర్వాయరు ప్రమాద స్థాయి నీటిమట్టం 380 కాగా, డెడ్ స్టోరేజీ 345 అడుగులుగా పరిగణిస్తారు. ఇంకా ఎగువ ప్రాంతం నుంచి ఇన్ ఫ్లో 900 క్యూసెక్కులు వచ్చి చేరుతుందని ప్రాజెక్టు జేఈ శ్యామ్‌కుమార్ తెలిపారు. ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువల ద్వారా రోజుకు 550 క్యూసెక్కులు విడుదల చేస్తున్నామన్నారు. నీటి మట్టం 378.0 అడుగులకు వచ్చేసరికి ప్రమాద హెచ్చరికలు జారీ చేస్తామన్నారు.

ఆరోగ్యశ్రీ సేవలందక మృత్యువుతో పోరాటం

సీపీఐ జిల్లా నాయకుడు భద్రం



మాట్లాడుతున్న సీపీఎం నేత భద్రం

అనకాపల్లి: రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేయడంతో క్యాన్సర్, హృద్రోగ తదితర అత్యవసర ఆపరేషన్లు చేయక రోగులు మృత్యువుతో పోరాడుతున్నారని సీపీఐ జిల్లా నాయకుడు ఎస్.భద్రం వాపోయారు. వెంటనే కూటమి ప్రభుత్వం బిల్లులు చెల్లించి సేవలను పునరుద్ధరించాలన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం పేద రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆరోగ్యశ్రీ పథకాన్ని ఆరు రోజులుగా నిలుపుదల చేయడంతో వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. వెంటనే ఆస్పత్రుల యాజమాన్యాలతో చర్చలు జరపడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్య, వైద్యం పట్ల ఏమాత్రం శ్రద్ధ చూపించడం లేదన్నారు. గత ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత రావడానికి ఐదేళ్లు పట్టగా, కూటమి ప్రభుత్వంపై ఏడాదిలోనే వచ్చిందని విమర్శించారు. ప్రజల్లో ఆగ్రహ జ్వాల రగిలితే కూటమి ప్రభుత్వం కూలిపోవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో సీపీఐ జోన్ నాయకులు తాకాసి వెంకటేశ్వరరావు, శ్రీరామదాసు అబ్బులు, కోరుబిల్లి శంకరరావు, మత్సుర్తి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆడదూడల వృద్ధికి కృత్రిమ గర్భధారణ

జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి రామ్మోహన్



పశువైద్య శిబిరంలో రైతులకు మినరల్ మిక్సర్ ప్యాకెట్లను అందజేస్తున్న డీఏహెచ్‌వో రామ్మోహన్

దేవరాపల్లి: ఆడదూడలు మాత్రమే పుట్టే లింగ నిర్ధారణ వీర్య నాళికలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి (డీఏహెచ్‌వో) డాక్టరు బి.రామ్మోహన్ సూచించారు. మండలంలోని పెదనందిపల్లిలో రాష్ట్రీయ గోకుల్ మిషన్, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత గర్భకోశ చికిత్సా శిబిరాన్ని ఆయన పర్యవేక్షించారు. పాడి రైతులకు మినరల్ మిక్సర్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడదూడలు పుట్టేందుకు అందుబాటులోకి తీసుకువచ్చిన ఒక్కో వీర్య నాళిక ధరను రూ. 250 నుంచి రూ.150కు తగ్గించామన్నారు. స్థానిక పశువైద్య శాలను సంప్రదించాలన్నారు. అనంతరం పశువైద్య శిబిరంలో 105 పశువులకు గర్భకోశ చికిత్స పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కె.కోటపాడు పశు సంవర్ధకశాఖ ఏడీఇ. దినేష్‌కుమార్, డీఎల్‌డీఏ పశువైద్యాధికారి సౌజన్య, ఎం.అలమండ, కొరువాడ పశువైద్యాధికారులు కె.హెచ్.పి. మంజుషారాణి, సింహాచలంనాయుడు, పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్లు రవీంద్ర, త్రినాథ్, సాయికుమార్, మనోజ్ పాల్గొన్నారు.

అనకాపల్లి, నక్కపల్లి సర్కిళ్లకు కొత్త సీఐలు



సీఐ ప్రేమ్‌కుమార్

సీఐ మురళి

అనకాపల్లి/నక్కపల్లి: అనకాపల్లి, నక్కపల్లి సర్కిళ్లకు కొత్త సీఐలను నియమించారు. అనకాపల్లి పట్టణ పోలీస్ స్టేషన్ సీఐగా గుగ్గిలపు ప్రేమ్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీలో భాగంగా అనకాపల్లి పట్టణ సీఐగా వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సీఐ టి.వి. విజయకుమార్ విశాఖ వీఆర్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పట్టణ సిబ్బంది సహాయంతో పోలీస్‌స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణకు తమవంతు సహాయం అందిస్తామన్నారు. ఎక్కడైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, శాంతిభద్రతల పరిరక్షణలో శక్తివంచన లేకుండా కృషిచేస్తామన్నారు.

నక్కపల్లిలో..

నక్కపల్లి సీఐగా జూరెడ్డి మురళి నియమితులయ్యారు. ఇక్కడ పనిచేసిన కుమారస్వామిని ఉన్నతాధికారులు వీఆర్‌కు పంపించారు. బల్క్‌డ్రగ్ పార్క్ ఉద్యమం నేపథ్యంలో మత్స్యకారులంతా జాతీయ రహదారిపై ధర్నా చేయడంతో నాలుగు గంటలపాటు ట్రాఫిక్ స్తంభించింది. 15 రోజుల క్రితం రాజయ్యపేటలో హోం మంత్రి కాన్వాయ్‌ను అడ్డగించడం వంటి ఘటనలు నేపథ్యంలో పోలీసుల వైఫల్యం ఉందని ఉన్నతాధికారులు గుర్తించారు. ఈ పరిణామాలతో సీఐ కుమార స్వామిని వీఆర్‌కు పంపించారు. ఆయన స్థానంలో విశాఖ సిటీ ఎంవీపీ కాలనీ సీఐగా పనిచేస్తున్న జూరెడ్డి మురళిని నియమించడంతో బుధవారం ఆయన బాధ్యతలు చేపట్టారు.

మరణంలోనూ వీడని బంధం

- ఒక రోజు వ్యవధిలో మృతి చెందిన వృద్ధ దంపతులు
- అన్యోన్యంగా జీవించి.. మరణంలోనూ కలిసి సాగారు
- వారి మృతితో శోక సంద్రంలో బంధువులు, కుటుంబ సభ్యులు



దేవుడమ్మ, తాతారావు (పాతచిత్రం)

కంచరపాలెం: ఒకరికొకరం జీవితాంతం తోడుగా ఉంటామని బాసలు చేసుకొని మనువాడిన వృద్ధ దంపతులు చివరికి మరణంలోనూ తోడుగా సాగారు. ఒక్క రోజు గడవకముందే ఒకరి తరువాత ఒకరు తనువు చాలించి మరణంలోను దాంపత్య బంధాన్ని చాటుకుని పలువురిని కంటతడి పెట్టించారు. వివరాలు ఇలా ఉన్నాయి. జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం పరిధి బర్మాక్యాంప్ పల్నాటి కాలనీలో నివాసం ఉంటున్న కల్లింపూడి దేముడమ్మ(62) అనారోగ్యంతో మంగళవారం రాత్రి మరణించింది. బుధవారం కుటుంబ సభ్యులు అంత్యక్రియలకు సిద్ధమవుతున్న సమయంలో దేముడమ్మ భర్త కల్లింపూడి తాతారావు(66) ఆమె పార్థివదేహం వద్ద ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించారు. అప్పటికే తాతారావు మృతి చెందాడని డాక్టర్లు ధ్రువీకరించారు. ఈ మరణవార్త కుటుంబ సభ్యులను, బంధుమిత్రులను శోకసంద్రంలోకి నెట్టింది. బతికున్నన్నాళ్లు ఎంతో అన్యోన్యంగా ఒకరంటే ఒకరు ప్రేమతో మెలిగిన వృద్ధ దంపతులు ఒక రోజు గడవకముందే ఒకేసారి తనువు చాలించి ఒకరికొకరు తోడుగా సమాధికి సాగారు. ఎప్పుడు కనిపించినా తోడుగా ఇద్దరు కనిపించే దంపతులు చివరి అంకంలోను కలిసి సమాధి కావడం చూపరులను కలిచివేసింది. బుధవారం సాయంత్రం బర్మాక్యాంప్ శ్మశాన వాటికలో కుమారుడు శ్రీనివాస్, బంధువులు, గ్రామ ప్రజలు అంత్యక్రియలు నిర్వహించారు. కాగా వారి కుమారుడు కల్లింపూడి శ్రీనివాసరావు ప్రైవేటు ఉద్యోగిగా పనిచేస్తూ కుటుంబానికి ఆధారంగా ఉన్నాడు. తల్లిదండ్రులను ఒకేసారి కోల్పోవడంతో గుండెలవిసేలా రోదిస్తున్నాడు.

తాచేరు కల్వర్టు నిర్మాణానికి ప్రతిపాదన

పరిశీలించిన ఆర్అండ్‌బీ అధికారులు



కల్వర్టును పరిశీలిస్తున్న ఆర్అండ్‌బీ జేఈ సాయి శ్రీనివాస్, వర్కు ఇన్‌స్పెక్టరు దేముడునాయుడు

మాడుగుల రూరల్: మండలంలో కె.జె.పురం తాచేరు వంతెన పక్కన కూలిపోయిన కల్వర్టును మాడుగుల ఆర్అండ్‌బీ జేఈ వి. సాయి శ్రీనివాస్, వర్కు ఇన్‌స్పెక్టరు పైలా దేముడునాయుడు బుధవారం పరిశీలించారు. దీనికి తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టినా నీటి ప్రవాహానికి మళ్లీ దెబ్బతింటుందని జేఈ తెలిపారు. దీనిదృష్ట్యా శ్లాబ్ కల్వర్టు నిర్మాణానికి రూ.30 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేసి నిధుల మంజూరు కోసం ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో మండల క్లస్టర్ ఇన్‌చార్జి భీశెట్టి విజయలక్ష్మి, మద్దాల ప్రసాదు పాల్గొన్నారు. ఇదిలావుంటే ఇక్కడ కల్వర్టు పూర్తిగా దెబ్బతినడం వల్ల కె.జె.పురం నుంచి చోడవరం వెళ్లే వాహనాలు వంటర్లపాలెం మీదుగా నడుపుతున్నారు.

ఈఎన్‌సీ చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా రియర్ అడ్మిరల్ మనోజ్ ఝూ



మనోజ్ ఝూ

సాక్షి, విశాఖపట్నం: తూర్పు నౌకాదళం(ఈఎన్‌సీ) చీఫ్ ఆఫ్ స్టాఫ్(ఆపరేషన్స్)గా రియర్ అడ్మిరల్ మనోజ్ ఝూ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మనోజ్ ఝూ డీఎస్ఎస్‌సీ (వెల్లింగ్టన్), యూకేలోని రాయల్ కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ స్టడీస్‌లో విద్యనభ్యసించారు. 1995 జనవరి 1న నౌకాదళంలో ఫ్లాగ్ ఆఫీసర్‌గా తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. గోవాలోని నావల్ అకాడమీ, ఇండియన్ నావల్ వార్ కాలేజ్ (గోవా)లో విధులు నిర్వర్తించారు. గన్నరీ నిపుణుడైన మనోజ్ ఝూ.. ఐఎన్ఎస్ చెన్నై యుద్ధ నౌకకు కమాండ్ ఆఫ్ డిస్ట్రాయర్‌గా విధులు నిర్వహించారు. ఏఎస్‌డబ్ల్యూ కర్వెట్ ఐఎన్ఎస్ కమోర్తా యుద్ధ నౌకకు మొట్టమొదటి కమాండింగ్ ఆఫీసర్‌గా, ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ ఐఎన్ఎస్ విరాట్‌లో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా విజయవంతంగా బాధ్యతలు పూర్తి చేశారు. ప్రస్తుతం ఆయన నేవల్ హెడ్‌క్వార్టర్స్‌లో అసిస్టెంట్ చీఫ్ ఆఫ్ నేవల్ స్టాఫ్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. అక్కడి నుంచి ఈస్ట్రన్ నేవల్ కమాండ్‌కు రావడం గర్వంగా ఉందని మనోజ్ ఝూ ఈ సందర్భంగా తెలిపారు.

వుషూ జాతీయ పోటీలకు గురుకుల విద్యార్థుల ఎంపిక



కోచ్‌లతో రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించిన విజేతలు

నర్సీపట్నం: రాజమండ్రిలో జరిగిన 69వ రాష్ట్ర స్థాయి వుషూ చాంపియన్‌షిప్ పోటీల్లో నర్సీపట్నం క్రీడాకారులు బంగారు పతకాలు సాధించారు. ఈ నెల 14, 15 తేదీల్లో జరిగిన పోటీల్లో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ బాలికల గురుకులం నుంచి పరవాడ జోత్స్న మేరీ, వేంపాటి ప్రణీతి మంచి ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించారు. వీరిద్దరు ఈ నెలాఖరున మణిపూర్‌లో జరగనున్న 69వ జాతీయ స్కూల్ గేమ్స్ అండర్ -19 పోటీల్లో పాల్గొంటారని శాప్ కోచ్ అబ్బు తెలిపారు. పెంట దుర్గాభవాని రజత పతకం, వెన్నెల కావ్య కాంస్య పతకం సాధించారు. మెడల్స్ సాధించిన విద్యార్థినులు, పీడీ సాయి, వీరికి తర్ఫీదు ఇచ్చిన వుషూ కోచ్ ప్రియాంకను ప్రిన్సిపాల్ రాజేశ్వరి అభినందించారు.

బోగస్ పట్టాల గుర్తింపునకేనా?

కొత్తపాలెం నిర్వాసిత కాలనీలో ఇంటింటి సర్వే



కొత్తపాలెంలో పట్టాదారుల వివరాలు నమోదు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

మాకవరపాలెం: ఆన్‌రాక్ (పయినీర్) భూ నిర్వాసిత కాలనీలో పట్టాల పంపిణీపై రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టారు. ఈ సర్వేకు ప్రత్యేక టీంను ఏర్పాటు చేశారు. మండలంలోని రాచపల్లి సమీపంలో ఆన్‌రాక్ రిఫైనరీ నిర్మాణం కోసం 2008లో భూ సేకరణ జరిగింది. ఈ సేకరణలో కొత్తపాలెం గ్రామాన్ని పూర్తిగా తొలగించారు. వీరికి తామరం రెవెన్యూలో ఇళ్లస్థలాలు పంపిణీ చేశారు. మొదటగా సుమారు 150 మందికి ఈ నిర్వాసిత కాలనీలో పట్టాలు పంపిణీ చేశారు. అనంతరం మరికొన్ని పట్టాలను అధికారులు అందజేశారు. అయితే బుధవారం రెవెన్యూ సిబ్బంది కొత్తపాలెంలో ఇంటింటికీ వెళ్లి పట్టాదారుల వివరాలు నమోదు చేశారు. అప్పట్లో ఇచ్చిన పట్టాదారులే నివాసం ఉన్నారా ? లేక వేరెవరైనా ఉంటున్నారా ? కాళీ స్థలాలు ఉంటే అవి ఎవరి ఆధీనంలో ఉన్నాయనే విషయాలపై విచారణ చేస్తున్నారు. దీంతోపాటు భూమి ఎంత సేకరించారు, పరిహారం పూర్తిగా అందిందా లేదా ? కోర్టు కేసులు ఏమైనా ఉన్నాయా అనే వివరాలు కూడా సేకరిస్తున్నారు. ఇదిలాఉండగా భూ సేకరణ సమయంలో ఇచ్చిన పలు హామీలు అమలు చేయలేని కారణంగా కొందరు నిర్వాసితులు ఈ సర్వేకు సహకరించలేదు. ఎవరైతే వివరాలు తెలియజేస్తున్నారో వాటిని సిబ్బంది నమోదు చేసుకున్నారు. ప్రధానంగా ఈ నిర్వాసిత కాలనీలో బోగస్ పట్టాలు ఉన్నట్టు ఇటీవల ఫిర్యాదులు అందినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో విచారణ నిమిత్తం రెవెన్యూ సిబ్బంది సర్వే చేస్తున్నట్టు సమాచారం. కాగా ఈ విషయంపై తహసీల్దార్ వెంకటరమణ మాట్లాడుతూ ఆర్డీవో ఆదేశాల మేరకు ప్రత్యేకంగా టీంను ఏర్పాటు చేసి సర్వే చేయిస్తున్నామని తెలిపారు.

క్లుప్తంగా

ఉపాధ్యాయ సమస్యలపై వినతి

అనకాపల్లి: ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి తెలిపారు. జీవీఎంసీ విలీన గ్రామం కేఎస్ఆర్‌పేటలోని డీఈవో కార్యాలయంలో డీఈవో గిడ్డి అప్పారావునాయుడుకు యూటీఎఫ్ నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు మేలు

అనకాపల్లి: జీఎస్టీ తగ్గింపుతో ధరలు తగ్గుముఖం పట్టాయని, ప్రజలకు మంచి లాభం చేకూరుతుందని మండల విద్యాశాఖ అధికారులు -1,2 శ్రీదేవి, కోటేశ్వరరావు తెలిపారు. బుధవారం స్థానిక ఎంఈవో కార్యాలయంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో జీఎస్టీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో నిత్యావసర సరుకులు, వివిధ రకాలైన వస్తువులపై భారీగా ధరలు తగ్గాయని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా తీసుకుని దీనిని ప్రతి వ్యక్తి తెలియజేయాలని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయన్నారు.

శుభ్రమైన ఆహారంతో ఆరోగ్యం


సైకిల్ ర్యాలీ ప్రారంభిస్తున్న సూర్యలక్ష్మి

అనకాపల్లి: మండలంలో తుమ్మపాలలో ఎనిమిదో రాష్ట్రీయ పోషణ మాసం -2025 సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాలు కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి సూర్యలక్ష్మి హాజరై సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ శుభ్రమైన ఆహారాన్ని తీసుకోవడం వల్ల ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా జీవిస్తారన్నారు. ఇటీవల కాలంలో పౌష్టికాహార లోపంతో అనేక ఇబ్బందులు పడే పరిస్థితులు ఏర్పడుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఏసీడీపీవో శశికళ, సూపర్‌వైజర్ సీహెచ్.కృష్ణవేణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, తల్లులు, తదితరులు పాల్గొన్నారు.

కరస్పాండెంట్‌కు సన్మానం


పురస్కారం అందుకుంటున్న కరస్పాండెంట్ రామకుమార్

కశింకోట: మండలంలోని తాళ్లపాలెంలో గాయత్రి హైస్కూలు కరస్పాండెంట్ బత్తిన రామకుమార్ రాష్ట్ర ఉత్తమ కరస్పాండెంట్ పురస్కారాన్ని పొందారు. మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతి పురస్కరించుకొని విజయనగరం జిల్లా గజపతినగరంలో ప్రైవేటు స్కూళ్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు దుశ్శాలువా కప్పి జ్ఞాపకను అందజేశారు. స్కూలు యాజమాన్యం, ఉపాధ్యాయ సిబ్బంది రామకుమార్‌కు అభినందనలు తెలిపారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 164 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	5,740	5,740
మొదటి రకం	4,330	5,660
రెండో రకం	4,020	4,670
మూడో రకం	3,910	3,990

అనకాపల్లి సినిమాలు

రాజా:	ఇడ్లీ కొట్టు(ఉదయం, మధ్యాహ్నం)
రాజా	: శశివదనే(ఫస్ట్, సెకండ్ షో)
సత్యనారాయణ స్క్రీన్-1:	కాంతార
సత్యనారాయణ స్క్రీన్-2:	ట్రోన్
పర్తిసాయి	: ఓజీ
షిర్డీసాయి	: మిత్రమండలి
వెంకటేశ్వర	: కానిస్టేబుల్
రామచంద్ర	: మిరాయ్

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 66 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-16, బీ పాజిటివ్-25, ఓ పాజిటివ్-21, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యాలోకేష్ (9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 382 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 339 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (08924-223595)ని సంప్రదించవచ్చు.

లక్ష్యానికి మించి..

- గతేడాది కంటే పెరిగిన వరి సాగు విస్తీర్ణం
- వర్షాలు ఆలస్యంగా కురిసినా అధికంగా నాట్లు
- తెగుళ్ల నివారణపై అధికారుల సూచనలు


పాము పొడ తెగులు సోకిన పొలం


బయ్యవరంలో నీటితో నిండి ఉన్న పెద్ద చెరువు


కశింకోటలో ఎదుగుదల దశలో ఖరీఫ్ వరి సాగు

కశింకోట: ఖరీఫ్ సీజన్ బుధవారంతో ముగిసింది. వరి నాట్లు వేయడం కూడా పూర్తయింది. వాతావరణం అనుకూలించింది. సాధారణ విస్తీర్ణాన్ని మించి అదనంగా ఈ ఏడాది 314 హెక్టార్లలో వరి నాట్లు వేశారు. గతేడాది కంటే కూడా 52 హెక్టార్లు ఎక్కువగా నాట్లు పడ్డాయి. సీజన్ ముగియడంతో వరి పంట సంరక్షణపై రైతులు దృష్టి సారించాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రధానంగా పొటాషియం లోపం రాకుండా సకాలంలో ఎరువులు వేసుకోవాలని, తెగుళ్లను గుర్తించి వాటి నివారణకు క్రిమిసంహారక మందులు పిచికారీ చేయాలంటున్నారు.

మండలంలో ఎక్కువ విస్తీర్ణంలో వరిసాగు చేస్తారు. ఈ ఏడాది 1,048 హెక్టార్లు సాధారణ విస్తీర్ణంగా అధికారులు నిర్ణయించగా, ఖరీఫ్ సీజన్ ముగిసిన బుధవారానికి 1,402 హెక్టార్లలో నాట్లు వేశారు. ఇది 314 హెక్టార్లు ఎక్కువ. గతేడాది కూడా సాధారణ విస్తీర్ణాన్ని మించి 1,360 హెక్టార్లలో నాటు వేయగా, అదనంగా 42 హెక్టార్లలో విస్తీర్ణం పెరిగింది. మొదట్లో వర్షాలు వెనుకడుగు వేసి ఇబ్బంది కలిగించినా తర్వాత వాతావరణం అనుకూలించి వర్షాలు కురవడంతో బయ్యవరంలోని పెద్ద చెరువుతోపాటు మిగిలిన గ్రామాల్లో సాగునీటి చెరువులు నిండటం, శారదా నదిలో సమృద్ధిగా నీరు రావడం, జమాదులపాలెం వద్ద రంగబోలు గెడ్డ జలాశయం నిండటంతో వాటి ఆయకట్టు భూముల్లో వరినాట్లు పూర్తయ్యాయి.

ఆశాజనకంగా వరినాట్లు..

కశింకోట, వెదురుపర్తి, బయ్యవరం, జమాదులపాలెం, కొత్తపల్లి, బుచ్చియ్యపేట, తేగాడ, పేరంటాలపాలెం, పరవాడపాలెం, ఉగ్గినపాలెం, తాళ్లపాలెం, గొబ్బూరు, విస్సన్నపేట, ఏఎస్ పేట, చింతలపాలెం, జెట్టపురెడ్డితుని, నూతలగుంటపాలెం, ఏనుగుతుని, అచ్చెర్ల, జి. భీమవరం, సుందరయ్యపేట, కన్నూరుపాలెం, తీడ, చెరకాం, మోసయ్యపేట తదితర గ్రామాల్లో ఆశాజనకంగా వరి నాట్లు పడ్డాయి. నాట్లు పూర్తి కావడంతో అయితే తెగుళ్ల బారిన పడకుండా, పొటాషియం వంటి లోపాలకు గురి కాకుండా పంట సంరక్షణపై ఇక రైతులు దృష్టి సారించాల్సి ఉందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

పొటాష్ ఎరువు జల్లడానికి ఇదే తరుణం:

ముందుగా వేసిన వరినాట్లతోపాటు ఇప్పటి వరకు వేసిన నాట్లలో పొటాషియం లోపం రాకుండా పొటాష్ ఎరువు వేయాలని సూచిస్తున్నారు. మండలంలోని జెట్టపురెడ్డితునిలో పొటాషియం లోపం ఉన్నట్లు అధికారులు ఇప్పటికే గుర్తించారు. పొలం మొదట పసుపు బారి తర్వాత ఎర్రబారి పోవడం దీని లక్షణం. పొలానికి యూరియాతోపాటు పొటాష్ వేసుకోవాలని, ఇందుకు ఇదే తరుణమని అధికారులంటున్నారు. మొదట దమ్ములో ఎకరాకు చెరో 25 కిలోల వంతున యూరియా, పొటాష్ జల్లుకోవాలంటున్నారు. ఆ తర్వాత పొట్ట దశకు చేరినప్పుడు మరో విడత 25 కిలోల వంతున యూరియాతోపాటు పొటాష్ వేసుకోవలసి ఉందంటున్నారు. లేదంటే పొటాషియం లోపంతో పొలం దిగుబడి తగ్గిపోతుందంటున్నారు.

కశింకోటలో పాముపొడ తెగులు

కశింకోట పొలాల్లో అక్కడక్కడ పాముపొడ తెగులు వ్యాపించినట్లు అధికారులు గుర్తించారు. దీని నివారణకు 'హెక్సా కొనిజోల్ క్రిమి సంహారక మందును 2 మిల్లీ లీటర్లు, లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఇలా ఎకరాకు మందు 10 స్ప్రెయింగ్ ట్యాంకుల నీటితో పిచికారీ చేయాల్సి ఉంటుందని సూచించారు.

> **తెగుళ్ల నివారణకు సూచనలిచ్చాం**
>
> మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ సాధారణ విస్తీర్ణాన్ని మించి గతేడాది కంటే ఎక్కువగా వరినాట్లు వేశారు. ఈ ఏడాది 1,402 హెక్టార్లలో వరి నాట్లు వేశారు. పొటాషియం లోపం రాకుండా పొలంలో తప్పనిసరిగా పొటాష్ ఎరువు ఎకరాకు రెండు విడతలుగా దమ్ములోను, పొట్ట దశకు చేరినప్పుడు 25 కిలోలు వంతున తప్పనిసరిగా వేసుకోవాలి. యూరియా మూడు దఫాలు 25 కిలోల వంతున వేసుకోవాలి. జెట్టపురెడ్డితునిలో పొటాష్ లోపం, కశింకోటలో పాముపొడ తెగులు గుర్తించి వాటి నివారణకు, పంట సంరక్షణకు సూచనలిచ్చాం.
>
> – ఎం.స్వప్న, వ్యవసాయాధికారి, కశింకోట

నవంబర్ 24న చలో ఢిల్లీ

అనకాపల్లి: దేశంలో ఏ ప్రభుత్వ ఉద్యోగికి లేకుండా ఒక్క ఉపాధ్యాయులకు మాత్రమే టెట్‌లో తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధిస్తేనే పదోన్నతి అని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ నవంబర్ 24న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద వేలాది మందితో ధర్నా నిర్వహించనున్నట్లు అఖిల భారత ప్రాథమిక ఉపాధ్యాయ సమాఖ్య, ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) జిల్లా అధ్యక్షుడు బోయిన చిన్నారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చెల్ల నాగేశ్వరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టెట్‌పై తమ నిర్ణయాన్ని మార్పు చేయాలని, ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు మినహాయింపును ఇవ్వాలని కోరారు. ఇప్పటికే ఈ విషయమై రివ్యూ పిటిషన్ కోర్టులో వేశామన్నారు. ధర్నా కార్యక్రమంలో ఉత్తర్‌ప్రదేశ్, గుజరాత్, హర్యానా, ఢిల్లీ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, అసోం, మిజోరాం, మేఘాలయ, మణిపూర్, వెస్ట్ బెంగాల్, ఒడిశా, దక్షిణాది రాష్ట్రాల నుంచి వేలాది మంది ఉపాధ్యాయులు పాల్గొంటారని పేర్కొన్నారు.

బల్క్ డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా నిరసన


బల్క్ డ్రగ్ పార్కును వ్యతిరేకిస్తూ తాళ్లపాలెంలో కళాసీల నిరసన

కశింకోట: నక్కపల్లి వద్ద ఏర్పాటు చేయనున్న బల్క్ డ్రగ్ పార్కును వ్యతిరేకిస్తూ మండలంలోని తాళ్లపాలెంలో సీఐటీయూ ఆధ్వర్యంలో కళాసీలు బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకరరావు మాట్లాడుతూ ఈ పార్కు వల్ల పర్యావరణానికి నష్టం కలగడంతోపాటు మత్స్యకారులు ఉపాధి కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు దీర్ఘకాలిక రోగాల బారిన పడతారని వాపోయారు. ఈ పార్కును వ్యతిరేకిస్తున్న మత్స్యకారులపై నిర్బంధాన్ని ఆపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గ్రామ పంచాయతీల ఏర్పాటుకు వినతి


డీఆర్వోకు వినతి పత్రం అందిస్తున్న మాణిక్యాలరావు, నాగభూషణరావు

తుమ్మపాల: గ్రామాల్లో పెరుగుతున్న జనాభా, అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని నూతన గ్రామ పంచాయతీల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి సూదికొండ మాణిక్యాలరావు కోరారు. డీఆర్వో సత్యనారాయణరావుకు వినతి పత్రం అందించారు. దశాబ్దాల క్రితం ఏర్పాటైన గ్రామ పంచాయతీలే నేటికీ కొనసాగుతున్నాయన్నారు. పంచాయతీల్లో శివారు గ్రామాల్లో పెరుగుతున్న జనాభా ఆధారంగా అర్హత అవకాశాలను పరిశీలించి ఆయా గ్రామాల్లోని ప్రజల అభిప్రాయాల మేరకు నూతన గ్రామ పంచాయతీల ఏర్పాటు చేయాలన్నారు. బడుగు, బలహీన వర్గాలకు కేటాయించిన కాలనీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు అధికంగా నివసించే ప్రాంతాలను వాటి అవకాశాలను పరిశీలించి నూతన గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసినట్లయితే ఆయా వర్గాలకు స్థానిక సంస్థల్లోనైనా రాజకీయ ప్రాధాన్యత కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వనమాల నాగభూషణరావు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణకు కృషి చేయాలి

నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్


పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: మెడికల్ కళాశాలలకు వ్యతిరేకంగా గ్రామీణ స్థాయి నుంచి కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ తెలిపారు. పార్టీ పట్టణ అధ్యక్షుడ మందపాటి జానకీరామరాజు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక రింగ్‌రోడ్డులోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో భరత్‌కుమార్ మాట్లాడారు. రాష్ట్రంలో పేద విద్యార్థులకు ఉచిత మెడికల్ విద్యను అందించేందుకు వైఎస్సార్‌సీపీ పాలనలో 17 మెడికల్ కళాశాలలు మంజూరు చేస్తే, కూటమి పాలనలో వాటిని పీపీపీ పద్ధతిలో కారుచౌకగా ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయడం ఏమిటని ప్రశ్నించారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో మోసపూరిత హామీలతో గద్దె నెక్కిన సీఎం చంద్రబాబుకు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని గ్రామీణ స్థాయి నుంచి నిర్వహించి, ప్రజల్లో మెడికల్ కళాశాలల ఆవశ్యకతను వివరించాలన్నారు. అంతకుముందు నియోజకవర్గంలో పలు శుభకార్యక్రమాల్లో భరత్‌కుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, 80వ వార్డు ఇన్‌చార్జి కె.ఎం.నాయుడు, పార్టీ సీనియర్ నాయకులు బొడ్డేడ శివ, సప్పారపు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కమిటీల నియామకం



అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు మేరకు అనకాపల్లి నియోజకవర్గ, పట్టణ, మండల, కశింకోట మండల కమిటీలను నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

అనకాపల్లి నియోజకవర్గ ఎఫిలియేటెడ్ వింగ్ కమిటీ...

నియోజకవర్గ ఎఫిలియేటెడ్ వింగ్ కమిటీ మైనార్టీ సెల్ అధ్యక్షులుగా షేక్ తరిష్మా, ఆర్టీఐ వింగ్ అధ్యక్షునిగా ఆడారి శ్రీనివాసరావు, దివ్యాంగుల విభాగం అధ్యక్షునిగా షేక్ రెహమాన్‌లను నియమించారు.

అనకాపల్లి పట్టణ కమిటీ...

వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పట్టణ ఉపాధ్యక్షులుగా గొల్లవిల్లి నర్సింగరావు, కుండల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శులుగా దాడి నారాయణరావు, అల్లు త్రినాథ్ రావు, ఆడారి శ్రీనివాసరావు, ఈగల మహేష్, కార్యదర్శులుగా కటారి మహేష్, బుద్ధ పెంటారావు, వాసుపల్లి తాతయ్యలు, బొండా వాసు, వి.పైడిరాజు, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా కడిమిశెట్టి లక్ష్మణరావు, కూండ్రపు లక్ష్మి, ఎడువాకల నూకరత్నం, కొడుకుల సుబ్రహ్మణ్యం, పెతకంశెట్టి గోపి, సూరిశెట్టి భాను, శిరసపల్లి సాంబ, దిమిలి సత్తిబాబు, టి.చరణ్ తేజ, సిమ్మి గోపాల్, బేతి ఈశ్వరరావు, మైపాలి నూకరత్నం, మళ్ల భోగలింగేశ్వరస్వామి, రెడ్డి చిన్ని నియమితులయ్యారు.

అనకాపల్లి మండల కమిటీ...

అనకాపల్లి మండల కమిటీ ఉపాధ్యక్షులుగా రాపేటి వెంకటేష్, నోట్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శులుగా బొడ్డు అచ్చిరాజు, పంచదార్ల కన్నారావు, గనిరెడ్డి శ్రీరామ్, సేనాపతి శ్రీనివాస్, కార్యదర్శులుగా గొంతిన పరమటయ్యనాయుడు, గుడాల ఆనంద్, యాదగిరి రామచంద్రరావు, మింది అచ్యుతరాము, పెనగంటి అనిల్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా మెల్లేటి మోహన్, కొణతాల రాజు, పెంటకోట రామకోటి, బొడ్డు దేముడుబాబు, మొల్లి మాణిక్యాలరావు, దొడ్డి నాగేశ్వరరావు, కొర్రా నరేష్, నారిపిన్ని మాధవరావు, పల్లా ముత్యాలు, జొన్న మహేష్, బొద్దపు ప్రసాద్, పొలినాటి ఆనంద్‌రావు, బొబ్బిరి శ్రీను, ఎం.ప్రభు, బోయిన శ్రీనివాసరావు నియమితులయ్యారు.

కశింకోట మండల కమిటీ...

కశింకోట మండల కమిటీ ఉపాధ్యక్షులుగా కన్నూరు ఎర్రయ్యనాయుడు, పెంటకోట బుజ్జి, ప్రధాన కార్యదర్శులుగా ఒమ్మి గంగునాయుడు, అద్దెపల్లి శ్రీనివాసరావు, మంత్రి ప్రసాద్, గాలి వెంకట శ్రీనివాసరావు, కార్యదర్శులుగా కలిగెట్ల నాయుడు, రాజాన కుమార్, గౌతు నాయుడు, గొంతిన శివ, నమ్మి శ్రీను, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా సీయాద్రి రాజు, పప్పల మాలినాయుడు, గుమ్మడి నారాయణరావు, గొలగాని రాజు, వీపీ నాయుడు, హనుమంతు నాగరాజు, దుంగ మహాలక్ష్మినాయుడు, కె.గంగరాజు, గొంతిన నూకరాజు, గనిరెడ్డి శేషు, పోతుల నగేష్, కె.శేఖర్ నియమితులయ్యారు.

అనకాపల్లి టౌన్ బూత్ వింగ్ కమిటీ...

అనకాపల్లి టౌన్ బూత్ వింగ్ కమిటీ అధ్యక్షునిగా సూరిశెట్టి వీరవెంకట సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా మెగలపల్లి సుబ్బారావు, నడిశెట్టి గోవింద్, ప్రధాన కార్యదర్శులుగా ఇ.వెంకట కృష్ణారావు, బుద్ధ పెంటారావు, ఎస్.చంద్రరావు, కార్యదర్శులుగా సీహెచ్.అప్పలనాయుడు, పెతకంశెట్టి గోపి, బి.ఈశ్వరరావు, పెంటకోట అప్పలనాయుడు, కోన దుర్గా ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా గుబ్బల లోకేష్, రాపేటి మహాలక్ష్మినాయుడు, సూరిశెట్టి సన్యాసిరావు, పాత్రపల్లి లోవరాజు, పొలమరశెట్టి మోహన్, ఎం.సురేష్, పి.వెంకట గణేష్ నియమితులయ్యారు.

వైఎస్సార్‌టీయూసీ అనకాపల్లి టౌన్ కమిటీ...

వైఎస్సార్‌టీయూసీ అనకాపల్లి టౌన్ కమిటీ అధ్యక్షునిగా ఎల్.వెంకట రామలక్ష్మణరావు, ఉపాధ్యక్షులుగా సూరిశెట్టి గణేష్, పూడి సూరిబాబు, ప్రధాన కార్యదర్శులుగా కొణతాల త్రినాథ్, కాండ్రేగుల రాముడు, దాడి జోగలింగేశ్వరరావు, కార్యదర్శులుగా పి.నాగేశ్వరరావు, ఆర్.రమణ, యండపల్లి చిరంజీవి, సీహెచ్.ధనంజయ, ఆరిపాక శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా శరగడం హేమ, ఎల్.నాగేశ్వరరావు, బి.సూరిఅప్పారావు, ఎస్.చిన్నరమణ, సూరిశెట్టి రాము, దొడ్డి బాలాజీ, మందపాటి ఆనంద్ నియమితులయ్యారు.

'దేవరాపల్లి పంచాయతీలో అవినీతిపై సమగ్ర విచారణ జరిపించాలి'

దేవరాపల్లి : దేవరాపల్లి పంచాయతీలో వెలుగు చూసిన అవినీతిపై సమగ్ర విచారణ జరిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి. వెంకన్న డిమాండ్ చేశారు. దేవరాపల్లిలో బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. దేవరాపల్లి ప్రజల కష్టాన్ని అధికార పార్టీ నాయకుల అండదండలతో ఇంటి పన్నుల రూపంలో వసూళ్లు చేసి ప్రభుత్వానికి చెల్లించకుండా స్వాహా చేశారని విమర్శించారు. ఈ అవినీతిలో స్థానిక సిబ్బంది హస్తం ఉన్నట్టు స్పష్టంగా అర్థమవుతుందన్నారు. అధికార పార్టీ నేతల అండతోనే ఈ అవినీతి బాగోతం భయటపడకుండా ఇప్పటి వరకు గోప్యంగా ఉంచారన్నారు. పంచాయతీలో ఇప్పటికే ఇరిగేషన్, గ్రామ కంఠం భూముల్లో ఇంటి నిర్మాణ అనుమతుల పేరిట పెద్ద ఎత్తున కొందరు అనధికారికంగా వసూళ్లకు పాల్పడుతూ దోచుకుంటున్నారన్నారు. గతంలో ఇదే పంచాయతీలో మరుగుదొడ్ల అక్రమాల్లో పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్‌కు గురయ్యారని ఆయన గుర్తు చేశారు. పంచాయతీలో ఇంటి పన్నుల వసూళ్లతో పాటు ఆర్థిక సంఘం నిధులపై కూడా సమగ్ర విచారణ చేపడితే భారీ స్థాయిలో అవకతవకలు బయట పడతాయన్నారు. పంచాయతీ అవినీతిపై జిల్లా కలెక్టర్, పంచాయతీరాజ్ కమిషనర్‌కు సైతం ఫిర్యాదు చేస్తామని అన్నారు.

'బల్క్ డ్రగ్' ఉద్యమంపై నిర్బంధం దుర్మార్గం



రాస్తారోకో నిర్వహిస్తున్న సిటు ప్రతినిధులు

పరవాడ: నక్కపల్లి మండలం రాజయ్యపేట వద్ద పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి తీవ్ర నష్టం కలిగించే బల్క్ డ్రగ్ పార్కును రద్దు చేయాలని చేస్తున్న ఉద్యమాన్ని అణగదొక్కేందుకు ఉద్యమకారుల్ని ప్రభుత్వం నిర్బంధించడం దుర్మార్గపు చర్య అని సిటు రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు ఖండించారు. బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటును తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సిటు ఆధ్వర్యంలో పరవాడ సినిమా హాల్ కూడలి వద్ద బుధవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బల్క్ డ్రగ్ పార్కును రద్దు చేయాలని ఆందోళన చేస్తున్న మత్స్యకారులపై కూటమి ప్రభుత్వం కేసులతో వేధింపులకు పాల్పడడం సహించబోమన్నారు. కాకినాడ తీరం తొండంగి వద్ద వచ్చిన పరిశ్రమను అక్కడి మత్స్యకారులు, రాజకీయ పక్షాలు వ్యతిరేకించడంతో దాన్ని నక్కపల్లికి తీసుకువచ్చారని ఆరోపించారు. మత్స్యకారులకు మద్దతుగా తాము సైతం ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సిటు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ, ప్రతినిధులు నాయుడు, బి.శ్రీను, సత్తిబాబు, రమణ, జి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి నాయకులు చెప్పినవారికే యూరియా

పరవాడ: రైతులకు యూరియా దొరక్క తీవ్ర ఇబ్బందులు పడుతున్న తరుణంలో కూటమి నాయకులు దాన్ని పక్కదోవ పట్టిస్తున్నారని వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు ఆరోపించారు. కూటమి నాయకులు సూచించిన వారికే 15 నుంచి 20 బస్తాలు అధికారులు ఇస్తున్నారని మండిపడ్డారు. బుధవారం పరవాడ మండలానికి ఒక లోడు యూరియా వచ్చిందని, కొంత మంది తమ కుటుంబ సభ్యుల ఆధార్ కార్డుల్ని పరిగణనలోకి తీసుకుని సగటును 15 బస్తాలు ఇచ్చారని ఆరోపించారు. వారికి భూమి ఎంత ఉంది? ఎంత అవసరం? అని చూడకుండానే యూరియా ఇవ్వడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం రైతులకు, ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా యూరియాను ఇష్టానుసారం పంపిణీ చేయడమేంటని ఆక్షేపించారు. దీనిపై ఏవోని వివరణ కోరగా.. కలెక్టర్ సమావేశంలో ఉన్నానంటూ ఫోన్ కట్ చేశారని పేర్కొన్నారు.

అబ్దుల్ కలాంకు ఘన నివాళి

అనకాపల్లి టౌన్: మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త డాక్టర్ అబ్దుల్ కలాం 95వ జయంతి వేడుకలు పట్టణంలో ఘనంగా జరిగాయి. సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షు డు బల్లా నాగభూషణం ఆధ్వర్యంలో జార్జి క్లబ్ వద్ద అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దాడి రత్నాకర్ మాట్లాడుతూ రామేశ్వ రం అనే ఊరులో జన్మించి పట్టుదల, స్వయంకృషితో దేశం గర్వించదగ్గ శాస్త్రవేత్తగా ఎదిగి ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. అబ్దుల్ కలాం సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పట్టణ వాకర్స్ క్లబ్ సభ్యులు, దాడి వీరునాయుడు కళాశాల ప్రిన్సిపాల్ కోరిబిల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి


బాల్య వివాహాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సూర్యలక్ష్మి

అనకాపల్లి: బాల్య వివాహాలు నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా స్త్రీ శిశుసంక్షేమ శాఖ అధికారి సూర్యలక్ష్మి తెలిపారు. మండలంలో తుమ్మపాల జెడ్పీహెచ్ స్కూల్‌లో అంతర్జాతీయ బాలికా దినోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కడైన బాల్య వివాహాలు జరిగినట్లయితే దగ్గరలో పోలీస్‌స్టేషన్, అంగన్‌వాడీ కేంద్రాల్లో సమాచారం ఇచ్చిన వ్యక్తుల పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. బాల్య వివాహాలపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామ కమిటీలను ఏర్పాటు చేశామని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, పౌష్టికాహారం తీసుకోవాలని, సెక్సువల్ హెరాస్మెంట్, చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్స్, బాలికల అక్రమ రవాణా, బాలికల ఉన్నత చదువుల కోసం కిశోర బాలికలకు వంటి వాటిపై ఆమె వివరించారు. కార్యక్రమంలో హైస్కూల్ సిబ్బంది, అంగన్‌వాడీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

17,18న ఎస్జీఎఫ్ మండల స్థాయి క్రీడల ఎంపిక పోటీలు

నక్కపల్లి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడల ఎంపిక పోటీలు ఈ నెల 17, 18 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఎస్జీఎఫ్ మండల కో ఆర్డినేటర్ అబ్దుల్ రెహమాన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్-14, 17 విభాగాల్లో బాల బాలికలకు వేర్వేరుగా ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. అండర్-14 బాలలు జనవరి 1,2012 తర్వాత, అండర్-17 బాలలు జనవరి 1, 2009 తర్వాత పుట్టిన వారై ఉండాలన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్ల విద్యార్థులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనేందుకు అర్హత ఫామ్, ప్లేయర్ ఎంట్రీ ఫామ్, గేమ్ ఎంట్రీ ఫామ్, మిడ్ డే మీల్ ఫామ్‌లను తీసుకురావాల్సి ఉంటుందన్నారు. తవ్వవానిపాలెం జెడ్పీ హైస్కూల్ ఎదురుగా మైదానంలో పోటీలు జరుగుతాయన్నారు.

వినాయక గుడి నిర్మాణానికి విరాళం


విరాళం అందజేస్తున్న చదరం కాశీ కుటుంబ సభ్యులు

అనకాపల్లి: తుమ్మపాల గ్రామంలో నిర్మాణంలో ఉన్న వినాయకుడి ఆలయానికి చదరం కాశీ జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు విరాళం అందజేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ పెద్దల సమక్షంలో బుధవారం చదరం కాశీ సతీమణి లక్ష్మీకాంతం, కుమారుడు నాగమహాలక్ష్మీనాయుడు, లక్ష్మీ గణేష్ దంపతులు రూ.1,01,116 విరాళాన్ని అందజేశారు.